వీధులు.. మురికి కూపాలు

అపరిశుభ్రంగా రాయదుర్గంలోని వెంకటేశ్వర కాలనీ

- ఎక్కడ చూసినా మురుగు గుంతలే
- రోడ్లపై పారుతున్న మురుగుతో అవస్థలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని 17వ వార్డు వెంకటేశ్వరస్వామి కాలనీ మురుగుమయమైంది. డ్రైనేజీలు, సీసీ రోడ్ల నిర్మాణానికి నోచుకోక ప్రజలు అవస్థలు పడుతున్నారు. డ్రైనేజీ డిస్పోజల్ వ్యవస్థ లేక రోడ్లపై మురుగునీరు, దీనికితోడు వర్షపునీటితో అధ్వాన పరిస్థితులు నెలకొన్నాయి. ఖాళీ స్థలాల్లో మురుగు పేరుకుపోయి దోమలకు నిలయంగా మారింది. కాలనీలో దాదాపు 150కిపైగా కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. కాలనీలోని రోడ్లలో అడుగువేయాలంటే పరిస్థితి ఘోరంగా ఉంది. బీఎస్‌టీ తోట వరకు రోడ్లపై మురుగునీరు నిలిచింది.

వైఎస్సార్‌సీపీ హయాంలో మున్సిపల్ సాధారణ నిధులు వెచ్చించి కాలనీ ప్రవేశంలోనే ఎడమవైపు నుంచి రూ.16 లక్షలతో ప్రధాన డ్రైనేజీ నిర్మించారు. ఈ డ్రైనేజీలేకపోయి ఉంటే పరిస్థితి మరీ అధ్వానంగా ఉండేది. శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి చెందిన మాన్యం భూమిలో 22 ఏళ్ల క్రితం పేదలకు ఇక్కడ స్థలాలు కేటాయించగా గృహ నిర్మాణాలు చేసుకున్నారు. అప్పటి నుంచి అభివృద్ధికి నోచుకోక ప్రజలు అవస్థలు పడుతున్నారు.


రాయదుర్గం వెంకటేశ్వరస్వామి కాలనీలో రోడ్లపై మురుగునీరు

దుర్వాసన భరించలేం



మా కాలనీలో మురుగు ముందుకు కదలడం లేదు. ఇళ్ల ముందే నిలిచింది. దీంతో కాలనీలో అపరిశుభ్రత నెలకొంది. కాలనీ పైభాగం మురుగునీరంతా కింద వైపు వచ్చి నిలుస్తోంది. దోమలబెడద అధికమైంది. సీసీ రోడ్లు లేక మురుగు నీరు రోడ్లపై పారుతోంది. వర్షం వస్తే పరిస్థితి మరీ ఘోరంగా ఉంటుంది.

– లక్ష్మి, వెంకటేశ్వర కాలనీ, రాయదుర్గం

డ్రైనేజీలు నిర్మించాలి



కాలనీలో డ్రైనేజీలు లేక రోడ్లపై మురుగునీరు నిలిచి ఉంటోంది. ఎక్కడబడితే అక్కడ డ్రైనేజీ నీరు నిలుస్తోంది. వర్షం వస్తే మరింత బురదగా మారుతోంది. విషపురుగులు, దోమల బెడద అధికంగా ఉంది. అధికారులు పట్టించుకోవడంలేదు.

– హుస్సేన్, వెంకటేశ్వరకాలనీ, రాయదుర్గం

పడకేసిన పారిశుధ్యం

బ్రహ్మసముద్రం: పల్లెల్లో పారిశుధ్యం పడకేసింది. కొద్దిపాటి వర్షానికే వీధులన్నీ బురదమయంగా మారుతున్నాయి. దీనికితోడు మురుగునీరు రోడ్లపైనే పారుతోంది. చెత్తాచెదారం గుట్టలుగా పేరుకుపోయింది. దీంతో పల్లెల్లో ఎటుచూసినా అపరిశుభ్రత నెలకొంది. అధికారులు, నాయకులు సమస్యలు పట్టించుకోవడంలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. మండలంలో 16 గ్రామ పంచాయతీలు, 33 గ్రామాలు ఉన్నాయి. మండంలోని పిల్లలపల్లి, సంతే కోండాపురం, ఎస్ కోనాపురం, నాగిరెడ్డిపల్లి, పాలవెంకటాపురం, బొమ్మగానీపల్లి, గొంచిరెడ్డిపల్లి, కన్నేపల్లి, బుడిమేపల్లి, ఎరడికెర , మామడూరు, ఎర్రకొండాపురం తదితర గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. పలు గ్రామాల్లో మురుగు కాలువలు నిర్మించలేదు. దీంతో ఇళ్లలోని నీరు వీధుల్లోకి చేరుతోంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత పల్లెల్లో ఎటుచూసినా అపరిశుభ్రతే నెలకొంది. వీధుల్లో చెత్తదిబ్బలు పేరుకుపోయాయి. రోడ్డు పక్కన పిచ్చిమొక్కలు తొలగించక అధ్వానంగా ఉంది. అధికారులు తూతూమంత్రంగా ఎప్పుడో ఒకసారి వచ్చి పరిసరాల పరిశుభ్రతపైనా, పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు ఫొటోలకు ఫోజులిచ్చి వెళ్తున్నారని ప్రజలు అంటున్నారు.

పూడికతో నిండిన డ్రైనేజీలు.: గ్రామాల్లోని డ్రైనేజీలు చెత్తచెదారంతో నిండిపోయాయి. కాలువల్లో మురుగు నీరు ముందుకు పారలేదు. అపరిశుభ్రతతో దుర్వాసన వస్తోందని స్థానికులు అంటున్నారు. రాత్రి సమయాల్లో కరెంటు లేక పోతే దోమల బెడద అధికంగా ఉంటోందని ప్రజలు అంటున్నారు.



పిల్లలపల్లిలోని ముద్దలాపురం రోడ్డు, కువ్వాడమ్మ గుడి వెనుక వీధిలో ఇలా..

క్లుప్తంగా

వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకుడికి సన్మానం


సాకే పురుషోత్తంను సన్మానిస్తున్న అధికారులు

ఉరవకొండ: అనంతపురంలోని గిరిజన భవన్‌లో శనివారం జరిగిన ఆదివాసి దినోత్సవంలో ఉరవకొండ వైఎస్సార్ విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు, గిరిజన సంఘం నాయకుడు సాకే పురుషోత్తంను సన్మానించారు. డీఆర్‌ఓ మలోల, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాస్ తదితరులు జ్ఞాపిక అందజేసి, సన్మానించారు. కార్యక్రమంలో జీవీఎస్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు శివశంకర్‌నాయక్ పాల్గొన్నారు.

ఏఐఎస్‌ఏ ఆవిర్భావ దినోత్సవం

ఉరవకొండ: స్థానిక ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతి గృహ ఆవరణలో ఆలిండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్‌ఏ) 35వ ఆవిర్భావ దినోత్సవం శనివారం నిర్వహించారు. నియోజకవర్గ కన్వీనర్ భీమేష్ మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు హరినాయక్, వినయ్, ఈశ్వర్, మంజునాథ్, విజయ్, వంశీ పాల్గొన్నారు.

నాగులకట్టకు ప్రత్యేక పూజలు


కణేకల్లు మార్కెండేయ స్వామి ఆలయంలో నాగులకట్ట వద్ద పాలు పోస్తున్న భక్తులు

ఉరవకొండ: మండల వ్యాప్తంగా శ్రావణ మాసం శనివారాన్ని పురస్కరించుకొని నాగుల పుట్టలో మహిళలు పాలుపోసి, మొక్కులు తీర్చుకున్నారు. స్థానిక గవిమఠం ప్రాంగణంలోని నాగులకట్ట వద్ద భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి, పూజలు చేశారు.

కణేకల్లు: స్థానిక చిక్కణ్ణేశ్వరస్వామి చెరువుకట్టపై ఉన్న నాగులకట్టకు శ్రావణమాస శనివారం సందర్భంగా భక్తులు పోటెత్తారు. నాగదేవతకు కుంకుమార్చన, మంగళహారతులు ఇచ్చారు. కణేకల్లు, గంగలాపురం, ఆదిగానిపల్లి తదితర గ్రామాల నుంచి భక్తులు నాగులకట్టకు వచ్చి పాలు పోశారు.

విద్యుత్ స్తంభాలను ఢీకొన్న బొలెరో వాహనం


హనిమరెడ్డిపల్లిలో విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న బొలెరో వాహనం

బెళుగుప్ప: హనిమిరెడ్డిపల్లి వద్ద శనివారం జాతీయ రహదారి పక్కనున్న విద్యుత్ స్తంభాలను బొలెరో వాహనం ఢీకొనింది. అనంతపురం నుంచి కళ్యాణదుర్గానికి టమాటాల బాక్సుతో వెళ్తున్న బొలెరో వాహనం అతివేగంగా వచ్చి,అదుపుతప్పి రహదారి పక్కనున్న విద్యుత్ స్తంభాలను ఢీకొట్టింది. విద్యుత్ స్తంభం విరిగి బొలెరో వాహనం ముందుభాగంలో పడింది. కాగా డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. ప్రమాద సమయంలో విద్యుత్ సరఫరా కూడా నిలిచిపోవడంతో ప్రమాదం తప్పింది.

ఘనంగా మహేష్‌బాబు జన్మదిన వేడుకలు


శెట్టూరులో హీరో మహేష్‌బాబు జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న అభిమానులు

శెట్టూరు: మండల కేంద్రంలో సినీ హీరో మహేష్ బాబు జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా జరిపారు. మహేష్‌బాబు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి, కేక్‌లు కట్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎమ్మెస్ రాయుడు, నాయకులు హరినాథరెడ్డి, పోస్ట్ రామకృష్ణ, గోపి, ఉపాధ్యాయులు అబ్దుల్‌వాహబ్ ఖాన్, ఆంజనేయులు, కూతుల తిప్పేస్వామి, యువరాజ్, హరీష్, వన్నూరుస్వామి పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని వాల్మీకి సర్కిల్‌లో సినీ నటుడు మహేష్‌బాబు జన్మదిన వేడుకలను అభిమానులు శనివారం నిర్వహించారు. పట్టణంలో ఫ్లెక్సీలు ఏర్పాటుచేసి కేక్ కట్ చేసి, సంబరాలు చేసుకున్నారు. సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్‌బాబు అభిమాన సంఘం అధ్యక్షుడు చిన్న నాగప్ప, తలారి నాగరాజు, రామచంద్ర, ఈశ్వర్, మహేష్ బాబు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే మానవాళి మనుగడ

కుందుర్పి: మొక్కల పెంపకంతోనే మానవ మనుగడ సాధ్యమని ఎస్కే చారిబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు లెనిన్‌బాబు తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని విలువల బడిలో వృక్షాబంధన్ కార్యక్రమాన్ని 18 పాఠశాలల్లో నిర్వహించారు.లెనిన్‌బాబు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతోనే మానవాళి మనుగడ సాధ్యమన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విలువల బడుల సిబ్బంది, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శప్రాయం

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి


వాల్మీకి విగ్రహానికి పూజలు చేస్తున్న మెట్టు గోవిందరెడ్డి

బొమ్మనహాళ్: వాల్మీకి మహర్షి అందరికీ ఆదర్శప్రాయమని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఉప్పరహాళ్ గ్రామంలో వాల్మీకి విగ్రహ ప్రతిష్ట, ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట నిర్వహించారు. మెట్టు గోవిందరెడ్డి హాజరై వాల్మీకి మహర్షి, ఆంజనేయస్వామి విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మెట్టు గోవిందరెడ్డి మాట్లాడుతూ వాల్మీకి మహర్షి చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలన్నారు. మనిషి ఎలా జీవించాలన్న దానికి శ్రీరాముడు ఆదర్శప్రాయమన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రామాంజనేయులు, వైస్ ఎంపీపీ రమేష్, నాయకులు పయ్యావుల సత్యన్న, పరమేశ్వర, కోటేశ్వరరెడ్డి, వెంకటరెడ్డి, లింగన్న, వెంకటేశులు, హనుమేష్, చిదానంద, ఫొటో బసవరాజు, కృష్ణ, దేవన్న, హరి, తిప్పేస్వామి, అంజి, మారుతి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కోసం పనిచేసిన వారికి పెద్దపీట


కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతున్న సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి

కణేకల్లు: వైఎస్సార్‌సీపీ బలం కార్యకర్తలేనని, కష్టపడి పనిచేసిన వారికి పార్టీలో తప్పక గుర్తింపు వస్తుందని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని రచ్చుమర్రి గ్రామంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు మారెంపల్లి మారెన్న, మండల కన్వీనర్ పాటిల్ నాగిరెడ్డి, పంచాయతీరాజ్ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆది సద్గురు చంద్రశేఖర్‌రెడ్డి, బీసీ సెల్ ప్రధాన కార్యదర్శులు హళ్లి నాగరాజు, వేమనతో కలిసి మెట్టు కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. మనస్పర్థలు, విబేధాలు పక్కన పెట్టి పార్టీ కోసం ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పని చేయాలన్నారు. పార్టీ శ్రేణులకు ఏ సమస్య వచ్చినా తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. గ్రామంలో పార్టీ బలోపేతం చేసే బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని కార్యకర్తలకు తెలిపారు. ఈసందర్భంగా కార్యకర్తలు పలు సమస్యలను మెట్టు దృష్టికి తీసుకెళ్లారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు హళ్లి సురేష్, హనుమంతు, వెంకటేశులు, దేవేంద్ర, సుధాకర్, ఎన్.పెద్దన్న, బీ.పెద్దన్న, ఎర్రిస్వామి, తిప్పయ్య, చిక్కణ్ణ, రామాంజినేయులు, దుర్గన్న, రుద్రప్ప, ధనుంజయ్య, ఎస్.హనుమంతు, కరిబసి తదితరులు పాల్గొన్నారు.

అధికార వ్యామోహంతో అబద్ధపు హామీలు


అయ్యగార్లపల్లిలో ప్రజలతో పథకాలపై ఆరాతీస్తున్న వైఎస్సార్‌సీపీనేతలు, కార్యకర్తలు

శెట్టూరు: కూటమి నేతలు ఎన్నికలప్పుడు అధికారంపై వ్యామోహంతో అబద్ధపు హామీలు ఇచ్చారని వైఎస్సార్‌సీపీ రాష్ట్రకార్యదర్శి బోయ తిప్పేస్వామి విమర్శించారు. శనివారం మండలంలోని అయ్యగార్లపల్లి లో ' రీకాలింగ్ చంద్రబాబూస్.. మేనిఫెస్టో' కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ మంజునాథ, కన్వీనర్ ఎమ్మెస్ రాయుడు, ఎంపీపీ సోమనాథ రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ అబద్ధపు హామీలపై వివరించారు. వైఎస్సార్‌సీపీ హయాంలో పార్టీలు, రాజకీయాలకతీతంగా అన్ని వర్గాలకు పారదర్శకంగా పథకాలు అందించారని గుర్తు చేశారు. కార్యక్రమం అనంతరం గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. పార్టీ గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేస్తామని జెడ్పీటీసీ మంజునాథ, కన్వీనర్ ఎమ్మెస్ రాయుడు, ఎంపీపీ సోమనాథ రెడ్డి అన్నారు. అయ్యగార్లపల్లిలో కార్యకర్తల, నాయకులతో గ్రామ కమిటీ సమావేశం నిర్వహించారు. గ్రామ అధ్యక్షుడిగా పి జగదీష్, ఉపాధ్యక్షుడిగా ఆనంద్, ప్రధాన కార్యదర్శి ఏ. రామంజి, కార్యదర్శులు ఎర్రబాలప్ప, బోయ తిప్పయ్య, వడ్డే హనుమంతు, షఫీవుల్లా, రంస్వామి, జొల్లు రామాంజిని ఎంపిక చేశారు. పార్టీ అనుబంధ సంఘ నాయ కులు శెట్టూరు తిప్పేస్వామి, మహాబలి, ప్రతాప్, నాయకులు పూజారి పాలయ్య, పెద్దింటి మంజునాథ, మూలింటి పాలయ్య, లింగప్ప, అంజి, తంజిల్, ఈశ్వర్, గనేష్, గొల్ల నాగప్ప, జయ్యన్న, మచ్చప్ప, నాగభూషణ, శీనప్ప, నాగప్ప పాల్గొన్నారు.

నేత్ర పర్వంగా పల్లకీ ఉత్సవం


పెన్నహోబిలంలో లక్ష్మీనృసింహుడి పల్లకీ సేవ చేస్తున్న దృశ్యం

ఉరవకొండ రూరల్: మండలంలోని ప్రసిద్ధ పుణ్య క్షేత్రం పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శనివారం శ్రీవారి పల్లకీ ఉత్సవం వైభవంగా జరిగింది. ఉదయం స్వామికి విశేష పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం భూదేవి, శ్రీదేవి సమేత లక్ష్మీనరసింహస్వామిని ఆలయ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ సాకే రమేష్‌బాబు, అర్చకులు పాల్గొన్నారు.

ఎలుగుబంటి సంచారంపై నిఘా


కురాకులగుట్టపై ట్రాకింగ్ కెమెరా అమర్చుతున్న అటవీ శాఖ సిబ్బంది

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ముత్తరాసి కాలనీ, గ్యాస్ గోడౌన్ లేఅవుట్ల వద్ద గల కురాకుల గుట్టపై ఎలుగుబంటి సంచరిస్తుండటంతో ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. శనివారం జిల్లా అటవీశాఖ అధికారి ఆదేశాల మేరకు ఎఫ్ఆర్‌ఓ రామచంద్రుడు, డీఆర్‌ఓ దామోదర్‌రెడ్డి, ఫారెస్ట్ బీట్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దాదాపు ఆరు రోజుల పాటు సిబ్బంది గస్తీ నిర్వహించారు. ప్రస్తుతానికి బైపాస్‌కు ఇరువైపులా ఎలుగుబంటి సంచారంపై ట్రాకింగ్ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు చెప్పారు. ఎలుగుబంటి నివాస లక్షణాలను బట్టి ఒక ట్యాగ్ ఏర్పాటు చేసి పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసరం లేదని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఆలయంలో చోరీ

కుందుర్పి: ఎర్రగుంట సమీపంలోని మారెమ్మ ఆలయంలో శుక్రవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. దుండగులు ఆలయంలోకి చొరబడి ఐదు కిలోల వెండి, 4తులాల బంగారం, హుండీలోని రూ.30వేల నగదు ఎత్తుకెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మూడో తూము ప్రారంభం


కణేకల్లు: కణేకల్లులోని చిక్కణ్ణేశ్వరస్వామి చెరువుకు రూ.22 లక్షలతో నిర్మించిన 3వ తూమును ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు శనివారం ప్రారంభించారు. తూము షట్టర్‌ను ఎత్తి ఆయకట్టుకు నీరును విడుదల చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చెరువు కిందనున్న ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు 3వ తూమును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కణేకల్లు హెచ్చెల్సీ సబ్‌డివిజన్ డీఈఈ దివాకర్ రెడ్డి, ఏఈఈ నరేంద్ర మారుతి, కణేకల్లు చెరువు సంఘం అధ్యక్షుడు బీటీ రమేష్, ఆదర్శభారతి రైతుసేవా సహకార సంఘం అధ్యక్షులు చంద్రశేఖర్‌గుప్తా, మాజీ వైస్ సర్పంచు ఆనంద్‌రాజ్, మార్కెట్‌యార్డు చైర్మన్ హనుమంతరెడ్డి, డైరెక్టర్ చాంద్‌బాషా పాల్గొన్నారు.

కమనీయం..లక్ష్మీవేంకటేశ్వర కల్యాణం


ఉరవకొండ: ఆలయంలో లక్ష్మీనారాయణ హోమం నిర్వహిస్తున్న దృశ్యం


ఉరవకొండలో శ్రీవారి కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు


బెళుగుప్ప: విఘ్నేశ్వరాలయంలో సత్యనారాయణ వ్రతం నిర్వహిస్తున్న దృశ్యం




ఉరవకొండ: ప్రసిద్ధిగాంచిన 10వ వార్డు రంగావీధిలో వెలసిన పురాతన లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో భూదేవి, శ్రీదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఉదయం స్వామికి అభిషేకం, మహా మంగళహారతి కార్యక్రమాలు నిర్వహించారు. కల్యాణోత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

భక్తులతో పోటెత్తిన ఆంజనేయ స్వామి ఆలయం

కూడేరు: శ్రావణమాసం మూడో శనివారాన్ని పురస్కరించుకొని కూడేరులో ప్రసిద్ధిగాంచిన బసాపురం ఆంజనేయస్వామి ఆలయం భక్తులతో పోటెత్తింది. ఆంజనేయ స్వామి దర్శనార్థం జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలి వచ్చారు. భక్తి శ్రద్ధలతో ఆంజనేయ స్వామిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు.

శనీశ్వరస్వామికి విశేష పూజలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కణేకల్లు రోడ్డు భగసింగ్ కాలనీలో వెలసిన శనీశ్వరస్వామికి శనివారం విశేష పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

సామూహిక సత్యనారాయణ వ్రతం

బెళుగుప్ప: మండల కేంద్రంలోని విఘ్నేశ్వరాలయంలో శనివారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రత పూజలు చేశారు. అర్చకులు రాంబాబుశాస్త్రి ఆధ్వర్యంలో సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. దాతలు పద్మా గోవింద్, అలివేలమ్మ దంపతులు పూజల్లో పాల్గొని, అన్నదానం చేశారు.

దుర్గంలో ఘనంగా రక్షాబంధన్


పోలీస్‌స్టేషన్‌లో పోలీసులకు రాఖీలు కడుతున్న సరస్వతీ శిశుమందిరం విద్యార్థులు


సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డికి రాఖీ కడుతున్న బ్రహ్మకుమారి సంస్థ సంచాలకురాలు యోగీశ్వరి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఓబుళాచారి రోడ్డులోని సరస్వతి శిశుమందిరంలో రక్షాబంధన్ వేడుక శనివారం ఘనంగా జరిగింది. సమావేశంలో వక్తలు రక్షాబంధన్ విశిష్టతను తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షుడు పొరాళ్ల ధనార్జున, కార్యదర్శి సోమనీలకంఠ, ప్రధానచార్యులు రాజేశ్వరి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈశ్వరీయ ప్రజాపిత బ్రహ్మకుమారీలు పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులకు సంచాలకురాలు యోగీశ్వరి ఆధ్వర్యంలో రాఖీ కట్టారు.

ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు

ఉరవకొండ:అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల బంధానికి ప్రతీక అయిన రాఖీ వేడుకను మండల వ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే పెద్ద ఎత్తున వివిధ ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సంప్రదాయ బద్ధంగా ఇళ్లలో అన్నచెల్లెళ్లు రాఖీ కట్టి, ఆశీర్వాదం పొందారు.

అన్నాచెల్లెళ్ల ప్రేమకు ప్రతీక రక్షాబంధన్

రాయదుర్గంటౌన్: అపారమైన ప్రేమ, అనురాగానికి ప్రతీక రక్షా బంధన అని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి అన్నారు. నియోజకవర్గ ప్రజలకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు. శనివారం ఆయన క్యాంపు కార్యాలయానికి విచ్చేసిన బ్రహ్మకుమారి సంస్థ సంచాలకురాలు యోగీశ్వరిని మెట్టు గోవిందరెడ్డికి రాఖీ కట్టారు. జూనియర్ సివిల్ జడ్జి రమ్య, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, సీఐ జయానాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప తదితర ప్రముఖులకు బ్రహ్మకుమారి సభ్యులు రాఖీలు కట్టారు.

బెళుగుప్ప: మండలంలోని గ్రామాల్లో రాఖీ పౌర్ణమిని శనివారం జరుపుకున్నారు. సోదరులకు సోదరిలు రాఖీలు కట్టి, శుభాకాంక్షలు తెలియజేశారు.

రాయదుర్గంలో భారీ వర్షం

రాయదుర్గంటౌన్: నియోజకవర్గంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం రాత్రి 10.30 గంటల నుంచి అర్ధరాత్రి వరకు భారీ వర్షం కురిసింది. శనివారం మోస్తరు వర్షం కురిసింది. పట్టణంలోని ముంపు కాలనీల్లో రోడ్లపై వర్షపునీరు పారైంది. నియోజకవర్గ వ్యాప్తంగా 142.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. అత్యధికంగా గుమ్మఘట్ట మండలంలో 58.2 మిల్లీమీటర్లు, రాయదుర్గంలో 43.2 మిల్లీ మీటర్లు, కణేకల్లులో 21 మిల్లీమీటర్లు, డి.హీరేహాళ్‌లో 20.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

సంక్షిప్త సమాచారం

బీటీపీకి కొనసాగుతున్న వరదనీరు

గుమ్మఘట్ట: నియోజకవర్గంలోని బీటీ ప్రాజెక్టుకు వరదనీరు కొనసాగుతోంది. కర్ణాటక ప్రాంతంలో శనివారం కురిసిన భారీ వర్షాలకు 1,900 క్యూసెక్కుల వరదనీరు ఇన్‌ఫ్లో వస్తున్నట్లు జల వనరులశాఖ ఏఈ హరీష్ తెలిపారు. ప్రస్తుతం 1645.5 అడుగులకు చేరుకున్నట్లు ఆయన తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

కళ్యాణదుర్గం రూరల్: పట్టణానికి చెందిన రామన్న (73) కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పట్టణంలో రెండు రోజుల క్రితం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో రామన్న తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు అతన్ని అనంతపురం ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తీసుకెళ్లారు.

చెరువులకు జలకళ

గుమ్మఘట్ట: మండలంలో వారం రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో వాగులు, వంకలు, చెక్‌డ్యాంలు పొంగిపొర్లాయి. కలుగోడు, నేత్రపల్లి, బేలోడు, భూపసముద్రం, ఆర్.కొత్తపల్లి, కేపీదొడ్డి చెరువులకు వరదనీరు చేరుకోవడంతో జలకళ సంతరించుకుంది. చెరువుల్లో వరద చేరుకోవడంతో భూగర్భజలాలు పెరిగే అవకాశాలు ఉన్నాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

వర్షానికి దెబ్బతిన్న ఇళ్లు


భూపసముద్రంలో దెబ్బతిన్న ఇల్లు

గుమ్మఘట్ట: మండలంలోని భూపసముద్రంలో గొల్ల సన్నప్పయ్య, విరుపాక్షి ఇళ్లు, రంగసముద్రంలో సరోజమ్మ ఇల్లు శనివారం పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఐదు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో ఇళ్లు పూర్తిగా తడిసి పాక్షికంగా దెబ్బతిన్నాయని బాధితులు తెలిపారు.

నేడు గ్రామ కమిటీల ఎంపిక

కుందుర్పి: మండలంలోని అప్పిలేపల్లి, తూముకుంట గ్రామ పంచాయతీల్లో వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీలు ఆదివారం ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీపీ కమలమ్మ, మండల కన్వీనర్ హనుమంతరాయుడు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు అప్పిలేపల్లి, మధ్యాహ్నం 2 గంటలకు తూముకంట గ్రామాల్లో కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు సర్పంచ్ అతావుల్లా, తూముకుంట వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

బ్రహ్మసముద్రం :మండలంలోని ముప్పలకుంట సమీపంలోని అటవీ ప్రాంతంలో పేకాట స్థావరంపై పోలీసులు శనివారం దాడి చేశారు. నలుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.18వేలు స్వాధీనం చేసుకున్నారు.

జీవీఎస్ఎస్ డివిజన్ అధ్యక్షుడిగా హరినాయక్

రాయదుర్గంటౌన్: రాయదుర్గం, గుమ్మఘట్ట డివిజన్ గిరిజన విద్యార్థి సమాఖ్య (జీవీఎస్ఎస్) నూతన అధ్యక్షుడిగా ఎస్.హరినాయక్‌ను నియమించినట్లు శనివారం ఓ ప్రకటనలో తెలిపాడు. గిరిజన విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హరినాయక్ తెలిపాడు.

నేటి నుంచి ఆరాధనోత్సవాలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని రాఘవేంద్ర స్వామి ఆలయంలో 10,11,12 తేదీల్లో ఆరాధనోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. మొదటిరోజు ఆదివారం స్వామి పూర్వారాధన సేవ, 11న మధ్యారాధన, 12న ఉత్తర ఆరాధన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు భక్త మండలి సభ్యులు తెలిపారు.